International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.1 Issue.1, June, 2014

# ప్రాచీన సాహిత్యంలో మాంసాహార ప్రాధాన్యం

**డా॥ దోనెంపూడి నారాయణరావు**
తెలుగు ఉపన్యాసకులు
శ్రీ అనంత పద్మనాభ కళాశాల,
వికారాబాద్, రంగారెడ్డి జిల్లా, ఆంధ్రప్రదేశ్-501101

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గతంలో బహుజన విద్యార్థుల 'బీఫ్ ఫెస్టివల్' నిర్వహించినపుడు వారిని వ్యతిరేకిస్తూ 'గోసంరక్షక సంఘంవాళ్ళో', హైందవ ఆచార సంప్రదాయాలను పరిరక్షిస్తామని కంకణబద్ధులైన వారో దాడిచేసి, దుర్భాషలాడి నానా హంగామ సృష్టించారు. అపుడు తీవ్రమైన ఘర్షణ వాతావరణం ఏర్పడిన సందర్భాన్ని టివి ఛానళ్ళలో చూసినపుడు గోమాంసాన్ని లేదా పశు మాంసాన్ని తినడం అంత నేరమా? ఎందుకు మేం పశుమాంసాన్ని తింటాం అని ఉత్సవం ప్రకటించిన వారిపై దాడి జరిగింది. ఈ రోజు హైదరాబాద్ వంటి నగరాల్లో, పట్టణాల్లో 'కళ్యాణి' బిర్యాని పేరుతో, గ్రామాల్లో ప్రతి రోజు కాకపోయినా వారానికో, నెలకో లేదా ఆయా పండగల సందర్భమో, వ్యవసాయపనులో, మట్టిపనులో పూర్తయిన తర్వాత భాగం ఉండి ఏదో ఒక పశువుని కోసుకొని పోగులు ఇంటికి తెచ్చుకొని వండుకతింటున్నారు. నిత్యం మేకనో, గోవులనో, కోళ్ళనో తినేవాళ్ళని ఏమి అనని వీళ్ళు మేం గోవును తింటాం అనగానే ఎందుకు అంతగా స్పందించారు. వీటి మూలాలు ఎక్కడ ఉన్నాయి. "గోమాంసం" తినడం అంత నేరం ఎప్పుడైంది. ఆర్యుల్లోని చాతుర్వర్ణాల వాళ్ళు ముఖ్యంగా బ్రాహ్మణులు ఎప్పుడు గోవులను భక్షణ చేయలేదా? ఎవరికైనా మొదలైన ఆలోచనలు, ప్రశ్నలు వస్తాయి.

వీటి గురించి ఆలోచిస్తే తెలుగు, సంస్కృత సాహిత్యాల్లో డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలు ప్రసంగాలు వంటి వాటిల్లో ఎన్నో ఆధారాలు దొరికాయి. తెలుగు లిఖిత సాహిత్యంలో 'మాంసాహారం' పైన అందులో గోమాంసం తినేవారిపైన ఏహ్యాభావం అసహ్యం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దాడి చేసిన వారి స్వభావం నన్నయలోనే కనిపిస్తుంది. మూల సంస్కృత భారతంలో ఏకచక్రపురంలో పాండవులకి ఆశ్రయమియచ్చిన బ్రాహ్మణుడు భీమునికి పెట్టిన ఆహారంలో "భీమసేనో మాంసాన్ని వివిధానిచ" (ఆది-159-36-37) అని అప్పటి మాంసాహారాన్ని వడ్డిస్తే 'ఆమాంసం' వేద ప్రమాణాన్ని బట్టి ఆవు మాంసమే అయ్యుంటుందనేది నిర్వివాదం. అతిథి మర్యాదలు అది అప్పటి ఆహారం.

ఈ శ్లోకాన్ని అనువాదం చేస్తు నన్నయ భీమునికి మాంస కూర వాసనకూడా చూయించలేదు.

(పలుదెఱుంగుల పిండివంటలు బప్పుగూడును నేతికుం / డలు గుడంబుదధి ప్రపూర్ణ ఘటంబులుం గొని వచ్చియాన్ (మహాభారతం, ఆదిపర్వం 6-291) దీన్ని గురించి బి. నాగయ్య తన తెలుగు సాహిత్య సమీక్షలో "మూలంలో మద్య మాంసాల ప్రసక్తి ఎక్కడ వచ్చిన దానిని నన్నయ పరిహరించడం బట్టి నన్నయ ఎంత సత్యమూర్తియో, ఎంత పరమ నైష్టికుడో తెలుస్తుంది అని (1. తెలుగు సాహిత్య సమీక్ష జి. నాగయ్య సం.పు. 11పు.79) వ్యాఖ్యానించడం బట్టి మద్య మాంసాల వినియోగించడం చాలా అసహ్యమని నన్నయ, నాగయ్యల ఉవాచ అందులో 'సత్యానికి' ఏమి సంబంధం. ఇక్కడ ఆపదానికి ఏమాత్రం అర్థం ఉందా. 'నన్నయ'గారు సత్యం చెప్పేవారయితే మూలాన్ని ఉన్నది ఉన్నట్లు అనువదించాలి. ఇకనిష్ఠ అనేది తెచ్చిపెట్టుకుంది.

శ్రీనాథుడు తన శివరాత్రి మాహాత్మ్యంలో కల్లు త్రాగి, పెద్ద మాంసం తింటే మనస్సు కొవ్వుపడుతుంది. ఆ కొవ్వు ఎట్లా తగ్గుతుందని అంటాడు. ఇక్కడ పెద్దమాంసం అంటే గోమాంసమే అని అర్థం. ఇది కూడా అసహ్యాభావమే. అయితే అది తిన్నవాడు సుకుమారుడునే భ్రష్ట బ్రాహ్మణుడు. వాడికి కైవల్యాన్ని ప్రసాదించాడు. (ఎనుబది యేడుల వార్ధక / మున భ్రాజనభక్తి యుడికి పోదాతనికిం / దినియెడిది పెద్ద మాంసము / కొనియెడిదికల్లు మనసుక్రొవ్వెట్టుడుడుగున్ (2.శ్రీశివరాత్రి మహత్మ్యం శ్రీనాథుడు 4వ ఆశ్వాసం పద్యం 19)

అల్లసాని పెద్దన తన 'మను చరిత్ర'లో వరూధిని, ప్రవరుని గురించి విరహవేధన పడుతూ కనిపించిన చంద్రుడి వల్ల తన బాధ ఎక్కువవుతుందని ఆ చంద్రుని నిందిస్తుంది.

1. గోవధము సేయు తురకల/దైవంబు నీవు మొదల దక్కకపాంథ/ స్త్రీవధము సేయరోయుదె... అంటుంది (మనుచరిత్ర 3-42)

ఇక్కడ వరూధునికి గోవధపైన అసహ్యం వేసే అవకాశం లేదు. ఎందుకంటే వరూధినికి గోవధ చేసే తురకలు సమకాలీకులు కాదు. వరూధిని ద్వితీయ మనువైన స్వారోచిషుని నాయనమ్మ ఆమెది ఏకాలమో నిర్ధారించలేం. బ్రాహ్మణుల కాల నిర్ణయం ప్రకారం ఇప్పుడు ఎనిమిదో మనువు కాలం జరుగుతుంది. ఒక్కో మన్వంతరానికి లక్షల సంవత్సరాలని చెబుతారు. దీన్ని బట్టి 'తురకల' గోవధని అల్లసాని పెద్దన కావాలనే వర్ణించాడు. ఇది శ్రీకృష్ణదేవరాయ కాలం నాటి బ్రాహ్మణ భావజాలానికి వారి నైష్టికానికి నిదర్శనం. గోమాంసం తినటం వల్ల ఏహ్యాభావాన్ని అదేపనిగా ప్రచారం చేయడానికి కారణంగా దీన్ని గ్రహించాలి.

కవులంటే ప్రజాపతులని ఎవరూ ప్రశ్నించలేని నిరంకుశులై, దివ్యదర్శనం గల ఋషులని ప్రకటించుకున్నారు. ఇలాంటి మేధావులు వాస్తవాన్ని వక్రీకరిస్తారని డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి ఈ దేశంలో మరుగు పరచిన చరిత్రను,కుట్రలను తవ్వితీసారు. వారి రచనలు – ప్రసంగాలు నాల్గవ సంపుటం అయిన "హిందుమతంలో చిక్కుముడులు" అన్న గ్రంథంలో అహింస చిక్కుముడి, అహింసనుండి మళ్ళీ హింసకు" అనే వ్యాసాల్లో చాలా వివరంగా ఈ "కుశాఖాహారుల" గుట్టుని బద్దలు చేశారు.

ఆర్యుల ఆహార విషయంలో ప్రధానమైన మార్పు జరిగింది. వారి వారసులైన నేటి హిందువులు ఆహార విషయంలో ఖచ్చితంగా ఉంటున్నారు. వీరిని శాఖాహారులు, మాంసాహారులని రెండు రకాలుగా విభజించవచ్చు. ఇక్కడ మనం మాంసాహారం గురించి మాట్లాడుతున్నాం. కాబట్టి మాంసం తినేవారు మూడు రకాలు.

1. ఆవు మాంసం తప్ప అన్ని జంతువులను తినేవారు 2) ఆవు మాంసంతో సహా అన్ని జంతువులను తినేవారు. 3) ఆవుమాంసం, కోడి మాంసం తప్పా మిగిలిన జంతువులను తినేవారు. చాతుర్వర్ణంలో బ్రాహ్మణులు ఉన్నతోన్నతులు వీరిలో పంచ ద్రావిడులు, పంచ గౌడులు అని రెండు భేదాలున్నాయి. వీరిలో పంచగౌడుల్లో గల సార్వత శాఖ వారు మాంసంతింటారు. మిగిలినవారు శాఖాహారులు. హిందూ సంఘనిర్మాణ దొంతరలో అట్టడుగు వారైన అంటరానివారు బ్రతికిన జంతువులను, పక్షులతో పాటు చనిపోయిన ఆవు మాంసాన్ని కూడా తింటారు. మిగిలిన బ్రాహ్మణేతరుల్లో కొందరు శాఖాహారులు ఇంకొందరు మాంసాహారులు. అయినా బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులంతా గోమాంస భక్షణని వ్యతిరేకిస్తారు.

ఒక హిందువు ఆహారం కోసం ఏ జంతువుని చంపడు. జంతువులని చంపడానికి కటికవారనే ఒక ఉపకులాన్ని తయారు చేశారు. ఈ రోజుల్లో ఆహారం కోసం ముస్లింలు ఒక్కరే జంతువులను వధిస్తారు. తినేవాడు, తినని సవర్ణ హిందువులందరికి అహింసలో నమ్మకముంది. నేటి హిందువుల్లో ఎక్కుభాగం ఈ దేశానికి అహింసా, శాఖాహారం కొత్త విషయాలు కావని బలంగా నమ్ముతారు. కాని వీళ్ళకు పూర్వులైన ఆర్యులు గోమాంసాన్ని తినేవారనడానికి బలమైన ఆధారాలున్నాయి. (అదే పుట 128-129)

ఈ విషయాన్ని మనం నిరూపించడానికి రాంభట్ల కృష్ణమూర్తి గారు తన 'జనకథ' అనే గ్రంథంలోని అంశాలు పరిశీలిస్తే వేద ఋషులు సంచార జీవనం గడిపేవారు. వీళ్ళు పశుపాలకులు, యజమానులు అనడానికి వాళ్ళ పేర్లతో వచ్చిన గోత్రాలే కారణం. వారికి పశువే సర్వస్వం. పశువే అన్నం. మనుగుడికి మూలం. ఈ పశుపాలక జనం పెద్దకు యజమానడని పేరు. యజమానుడంటే యజ్ఞం చేసేవాడనర్థం. యజ్ఞం అంటే సామూహిక భోజనం. ఇది యజుం ఉత్పత్తి విధానం. ప్రతి రోజు భోజనానికి మందలోని కొన్ని పశువులను ఎంపిక చేసి వాటిని కోసి చర్మం తీసి వంటకు అనువుగా తయారు చేస్తారు. ఆమాంసాన్ని కరకుట్టులుగా కాల్చే క్రమంలో మాంసం కాలడానికి నెయ్యి పోసేవారు. ఈ పని జరిగేపుడు మంట చుట్టు చేరి తమ పూర్వులు కట్టిన కవితలను గానం చేస్తారు. ఇవి కాలేపుడు లేచే పొగ వారికి మబ్బుతునకల్లా కనిపించేది. ఈ మబ్బుతునకలే వర్షంగా కురుస్తుందని వారి నమ్మకం. పశుమాంసం వాటి పాలు పుష్టికర ఆహారం. దీనివల్ల జనాభా పెరిగింది. జనాభాతో పశువాన్నం పెరగదు. కాబట్టి స్థానిక స్థిర నివాసులైన సింధు ప్రజల నుండి వ్యవసాయం దశలోకి ప్రవేశించారు. (జనకథ –పుట 6)

ఈ విధంగా నిత్య ఆహారంలో భాగంగానే కాక ప్రధానంగా మూడు ముఖ్యమైన సందర్భాలల్లో ఆవు మాంసాన్ని ఆర్యులు తినేవారు. అవి 1) అతిథి పూజ 2) వివాహం 3) శ్రాద్ధ కర్మ. వీటిలో అతిథి పూజ, వివాహం అనేవి ఆర్యులు పవిత్రంగా భావినిచే 'మధుపర్కం' కిందికి వస్తుంది. వీటికి సంబంధించి సంస్కృత లౌకిక సాహిత్యంలో ఆధారాలున్నాయి.

సమాంసోమధుపర్క అనే శ్లోకంలో

మధుపర్కం అనే పదానికి చేతిలో తేన పోయడం అని అర్థం. దీనికి శబ్దరత్నాకరం అనే నిఘంటువు పెరుగుతో కలిపిన తేనె, పెండ్లిలో వధూవరులకిచ్చే వస్త్రం అని రెండు అర్థాలు ఇచ్చింది. ఆ తరువాత తేనెతో పెరుగు నెయ్యి, యవలు బార్లి మొదలైన పదార్థాలు చేరాయి. ఈ మధుపర్కం గురించి అనేక గృహ్యా సూత్రాల్లో వివరంగా ఉంది. వీటికంటే ముందు వేదం సమాంసోమధుపర్క అంటుందని భవభూతి తన ఉత్తరరామచరితం అనే నాటకం నాల్గవ అంకం ప్రారంభంలో గల మిస్ర విష్కంభంలో చెప్పాడు. దీనిలో వాల్మీకి ముని శిష్యులైన భాండాయణుడు, సౌధాతకి మధ్య జరిగిన సంభాషణలో దీని గురించి వస్తుంది. భాండాయణుడు వయస్సులో సౌధాతి కన్నా పెద్దవాడు. సంస్కారవంతుడు సంస్కృతంలో మాట్లాడతాడు. సౌధాతకి తక్కువ తరగతికి చెందినవాడు. ప్రాకృత్వంలో మాట్లాడుతాడు. వశిష్టుడు తన భార్య అయిన అరుంధతిని, దశరథుని భార్యలు కౌసల్య, సుమిత్ర, కైకలను తీసుకొని వాల్మీకి ఆశ్రమానికి వస్తాడు. అపుడు సౌధాతకి వీళ్ళు అతిథులుగా రావడం వల్ల దీనురాలైన కపిల గోవు మంగళమూర్తి అయ్యింది అని బాధగా చెబుతాడు. దానికి బాండాయణుడు సమాధానంగా "సమాంసోమధుపర్క ఇత్యామ్నాయం బహుమన్య మానా శోత్రియాభ్యాగతాయ వత్సతరీం మహోక్షం మహోజంవా నిర్వపన్తి గృహమేధిని ఇతి ధర్మసూత్రకార స్సమామంతి" అని గోవునొ వధించి ఆతిథ్యమివ్వడం వేద, సూత్రాలని అనుసరించే చేశారని సమర్థిస్తారు. (ఉత్తర రామచరితం –పుట 222)

దీనిలో సమాంసోమధుపర్క ఇత్యామ్నాయం అంటే మాంసం లేకుండా మధుపర్కం ఉడకూడదని వేదం చెబుతుంది అని అర్థం. ఈ మధుపర్కం ఎవరెవరికి, ఎప్పుడు, ఏమి ఇవ్వాలో అన్న విషయం కూడా వివరించాడు. మధుపర్కానికి అర్హులైన వారు ఆరుగురిని గుర్తించారు. అది ఎవరికి పడితే వారికి ఇవ్వబడదు. వారు ఋతిజ్వుడు (యజ్ఞాన్ని నిర్వహించేవాడు), ఆచార్యుడు, పెళ్ళి కొడుకు, రాజు, స్నాతకుడు (గురుకులంలో అప్పుడే విద్యను పూర్తి చేసినవాడు) ఆతిథ్యం ఇచ్చే వారికి ఇష్టమైన వారెవరైనా అనేవారు, వీళ్ళలో ఋతిజ్వుడు, రాజు, ఆచార్యులనే ముగ్గురు ఇంటికి వచ్చిన ప్రతిసారి, మిగిలినవారికి సంవత్సరానికి ఒక్కసారి ఆతిథ్యం ఇవ్వాలి. (డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలు – ప్రసంగాలు, సంపుటం 4 పుట 129–130) వీళ్ళకి కొదమ పెయ్యగాని, ఆబోతునుగాని, పెద్దమేకనుగాని కోసి ఆహ్వానించాలని సూత్రకారులైన ఆపస్తంభ, బోధాయనల వంటి వారు చెబుతారని వివరించాడు. పైగా మన ఆశ్రమానికి వచ్చిన వారు వశిష్ట మహాముని అనగానే సౌధాతకి వెంటనే నేనింకా ఆయన పెద్దపులో, తోడేలో అనుకున్నా అందుకేనా కపిలపెయ్యని పరపరలాడించింది అని వ్యంగ్యంగా అంటాడు. దీన్ని బట్టి పూర్వ ఆర్యుల కాలం నాడు ఆవుకూర పెట్టి ఆహ్వానించటం అప్పటి మర్యాదని ఈ అహింసా మూర్తులు, ధఌ్మపరిరక్షకులు గమనించాలి.

రెండవ సందర్భం వివాహమప్పుడు ఇచ్చే మధుపర్కం గురించి ఆలోచిస్తే దీని రూపం పూర్తిగా మారిపోయింది. పెండ్లి పిల్లలకి పెట్టే వస్త్రాలకి ఈ రోజు దీన్ని వాడుతున్నారు. కాని వీరి పూర్వ ఆర్యుల ధర్మం ఏమిటంటే వధూపరిచయం అయిన తర్వాత వరునికి మామ ఒక ఆంబోతునిస్తాడు. ఆ సందర్భాన్ని మధుపర్కం అంటారు. ఆ అల్లుడు దాన్ని తీసుకెళ్ళి పెంచుకోడు. దాన్ని వధించి ఆ నెత్తురులో కలిపి మధుపర్కం తయరు చేస్తాడు. అప్పుడు మధుపర్కం మధుపర్క మధుపర్కో మధుపర్క అని గట్టిగా అరవగానే అల్లుడు అక్కడికి పోయి తాగుతాడు. (జనకథ పుట నెం.49)

దీన్ని సమర్థిస్తూ గృహ్య సూత్రాలు మాంసం లేకుండా మధుపర్కం లేదన్నాయి. హరితన గృహ్యసూత్రం, బోధాయన గృహ్యసూత్రం ఒక వేళ ఆవును మినహాయిస్తే మేక, పోటేలు, జింక వంటి వాటిని ఇవ్వాలన్నారు. ఆపస్తంబ సూత్రం ఎద్దు మాంసం, పాలిచ్చే ఆవు మాంసం తినవచ్చు అంటుంది. వాజసనేయకం ఆవు మాంసం పరిశుద్ధమైందిగా భావించి తినాలంది. ఇందులో విశేషమేమంటే వేద ఋషులు ఎవరైనా భవభూతి తెలుగువాడనే సాహిత్యం లోకంలో ఒక వాదం ఉంది. అలాగే బోధాయనుడు, ఆపస్తంభుడు తెలుగువారిని చరిత్రకారులు నిర్ధారించారు. (డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలూ – ప్రసంగాలు. సంపుటం. 4పుట 130–131)

ఇక మూడో అంశం శ్రాద్ధకర్మ గురించి పరిశీలిస్తే హిందువులు చనిపోయిన తమ తండ్రి, తాత, ముత్తాలందరిని కలిపి పితరులు అంటారు. వీరిని దేవతలుగా భావించి పితృదేవతలుగా చనిపోయి పితృలోకంలో ఉంటారని బలంగా నమ్ముతారు. అలోకంలో ఉన్నవారికే సంవత్సరానికి ఒకసారి పిండప్రధానం చేయడం పవిత్రకార్యం. ఒక బాధ్యతగా భావిస్తారు. ఇది షోడశకర్మల్లో ఒక విధి. అప్పుడప్పుడు పిల్లలు తమ మాట వినక చేయకూడని పనులు చేస్తే వారి తండ్రులు 'తిలోదకాలిచ్చాను' ఎక్కడికో చావరా అనే నానుడి కూడా ఉంది. పిండ ప్రధానంతో పాటు నువ్వులు, నీళ్ళు వేద, శాస్త్ర పురాణాల్లో చెప్పినట్లు మంత్రాలు చదువుతూ వదులుతారు. ఈ పని చేయదానికే పుత్రుడిని కనాలని ప్రతి హిందు తల్లిదండ్రి కలలు కంటారు. గుడులు గోపురాలు తిరుగుతారు. అవసరమైతే లోపం మగవాడిలో ఉన్నా రెండోపెళ్ళి చేసుకుంటారు. ఈ పిండ ప్రధానం కోసం కొడుకుని కనడానికి ఆరాటపడతారు.

'పుత్రుడు' అంటే పున్నాను నరకం నుండి రక్షించేవాడని అర్థంకూడా చెప్పుకున్నారు. దీని ద్వారా స్త్రీలని వారసత్వ హక్కుల నుండి రద్దు చేయాలని కుట్రపూనారు. అందులో ఫలవంతమయ్యారు. (సామాజిక పరిణామంలో స్త్రీ పుట 45–49)

దీనితోపాటు మన ప్రస్తుత విషయానికి వస్తే ఈ ధర్మరక్షకులు వారసులు పెదుతున్నట్లే వీళ్ళ పూర్వ ఆర్యులు శాఖాహార పిండప్రధానం చేసారా అంటే లేదనే సమాధానం వస్తుంది. దీనికి నిదర్శనంగా సంస్కృత నాటక కర్త భాసుడు రాసిన ప్రతిమానాటకం రాముడు అయోధ్యని వదిలిన తర్వాత తన తండ్రి దశరథుడు చనిపోయి ఒక సంవత్సరం అయినపుడు పిండ ప్రధానం దేనితో చేయాలి. నా చేతిలోని దర్భాల చూసి పితృలోకంలోని ఆయన ఆత్మక్షోభిస్తుంది అని వేధనతో సీతతో అంటాడు. అప్పుడే మాయా రూపంలో వచ్చిన రావణుడు తనకి గల శాస్త్రజ్ఞానం గురించి చెబుతూ 'శ్రద్ధకల్పం'కూడా చదివానంటాడు. దానికి రాముడు ఆసక్తితో పితరులకి ఏ విధమైన పిండ ప్రధానం చేయాలని అడుగుతాడు. దానికి ఆయన దర్భాలు, ఓషదులు, తిలలు, శాకములకంటే 'కైలాసగిరి' దగ్గర తిరిగే 'కాంచన పార్శాలనే మృగమాంసంతో పెట్టాలనగానే దానికోసం రాముడు వేగంగా ఉరుకుతాడు. కాబట్టి ఈ ఆచారం బాసకవికాలం దాకా ఉండేదని దీన్ని బట్టి మనం ఊహించవచ్చు.

దీనికి కొనసాగింపుగా పిండ ప్రధానంలో మాంసం పెట్టడమే కాదు, మిగిలిన దాన్ని చక్కగా ఆరగించాలని ఎర్రనగారు తన భారత అరణ్యపర్వ శేషం ధర్మవ్యాదోపాఖ్యానంలో

"పితృదైవతకార్యములం' / దతిభక్తి మాంసమిడుట యర్హమనియు
దత్పితృదైవ శేషములున / మ్మతిభోజ్యములనియు మునులమతములుగావే"

అని అభివర్ణించారు. ఇంకా ఈ ఉపాఖ్యానంలో హింసా, అహింసలమధ్యగల సన్నని తెరని అర్థంచేసుకోవటం ఎవరివల్ల కాదు అని

బోయవాడైన ధర్మంవ్యాధుడు 'కౌశికుడునే' బ్రాహ్మణునికి బోధిస్తాడు. ఆ క్రమంలోనే

"సీ అనఘ యౌశీనరుండగు శిబి నిజగాత్ర /హింస నిద్రాజ్ఞుల కిడడె మాంస
మతనికి లేదయ్య యుత్తమగతి ? / రంతి దేవుండను రాజుతొల్లి
యనుదినంబును గో సహస్రద్వయంబు దా / వధియింపడే వేయి వత్సరములు
దురితమమ్మహి తాత్మ దొడరెనే? వేదార్థ / నిరతులై యత్యంత నియుతులైన

తే॥ ధారుణీసురముఖ్యలధ్వరములందు / పశువధింపరే పశువుల బరమపుణ్య
గతులు గలుగవే వారికి? గడిగి / యజ్ఞులధిక మాంసార్థులని సృతులందులిమె

(మహాభారతం అరణ్య పరవశేషు 5-55) దీనిలో ప్రధానంగా నాలుగు అంశాలున్నాయి. అవి.

1. శిభి చక్రవర్తి త్యాగంలో హింసలేదా!

2. రంతిదేవుడు ప్రతి రోజు రెండు వేల ఆవులని తను బ్రతికిన వేయి సంవత్సరాలు సంతర్పణ చేశాడు. అయినా అతనికి పాపం ముట్టలేదు.

3. వేదాలు చదివిన బ్రాహ్మణులు యజ్ఞాల్లో ఆవులను బలివ్వలేదా?

4. అగ్నులధిక మాంసార్థులని శ్రుతి చెబుతుంది. అంటే నాటి ఆర్యులకి, నేటి హిందువులకి అగ్ని ప్రత్యక్ష దైవం.

వేదం ప్రకారం అగ్ని అంటే అధికంగా మాంసాన్ని కోరేదని అర్థం అంటున్నాడు.

రంతి దేవుని గోమాంస సంతర్పణ, యజ్ఞాల్లో గోమాంసాన్ని అగ్నికి ఆహుతి చెయ్యడం, యజ్ఞానికి చేయించిన వాళ్ళ సర్వసాధారణంగా తినడం అంతా హిందూధర్మ పరిరక్షకుల వారసత్వం, వారి ఎదుగుదలకు గోమాంస భక్షణ మీదే ఉందనేది సారాంశం.

అయితే అంతకు పూర్వం అంతగా తిన్న ఆర్యులు, ఆ తర్వాత వారి వారసులు ఎందుకు గోమాంస భక్షణని నిషేదించారు. అలాగే అవర్ణులకి లేదా అస్పృశ్యులకి కడుపుకి తిండిని దూరం చేసి, చచ్చిన గోవులని తినిపించి లేదా తినే పరిస్థితులు కల్పించి ఊరికి దూరంగా వర్ణ బాహ్యులని చేసి శాశ్వత వెలివేతని నుదిటిమీద ఎందుకు రాశారని ప్రశ్నించాలి. గోమాంస భక్షణ నిషేధ మూలాలు మనుస్మృతిలోను, 'కలివర్జ్యం' పేరుతో వివిధ పురాణాలులో అక్కడక్కడ చెప్పారు. కలివర్జ్యం అంటే కలియుగంలో వదిలి వేయాల్సినవి అని అర్థం. ఇవి మొత్తం నలభై మూడింటిని గుర్తించారు. వాటిని 'ఆదిత్యపురాణం' ఒక చోటికి చేర్చింది. అంటే ఇవి పూర్వం బాగా అమలులో ఉండి, ఆచరించి ఆ తరువాత కొన్ని విధులని నిషేధించారు. వాటిలో కొన్ని 1, గోమేధ యజ్ఞంలో గోవులను చంపడం 2. శ్రౌతమనేయాగంలో మద్యంతాగడం 3) వరునికి, అతిథులకు, పితరులకి అంటే మధుపర్క శ్రాద్ధాలలో మంత్రాలతో మాంసాన్ని అర్పించడం 4) బ్రాహ్మణులు బలిపశువుని వధించడం 5) బ్రాహ్మణులు సోమ తీగలను అమ్మటం. ఇవి మద్యమాంసాలపై విధించిన నిషేధాలు వీటని ఖండించకుండా నిషేధించడంలో వీటిని ఆచరించినా వాళ్ళకేమి బాధలేదు అని "హిందూ మతంలో చిక్కుముడులు" అన్న గ్రంథంలో డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ వీరి గుట్టులను వివరించారు. డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలు - ప్రసంగాలు సం.పు. 4 (పు. 264-267)

ఒక జాతి తెగ ప్రత్యేకించి ఒక జంతు మాంసాన్ని తినడం నిషేధించడాన్ని 'మానవశాస్త్రం' ప్రకారం ఆ జాతి లేదా తెగ 'టోటమ్ దశ' ఆచార క్రమంలో జరిగిందని చెబుతుంది. ఆహార సేకరణ, పశుపాలన, వ్యవసాయ దశల్లో అంటే నాగరిక పూర్వదశల్లో ఆహారంగా మానవజాతి మాంసాహారం తినడం సహజం. ఈ భూమి మీద అలా మాంసం తినని జాతే లేదని చెప్పవచ్చు. ఇప్పుడు మేం శాకాహారులం, అహింసామూర్తులమని చెప్పుకునే ఏ జాతి వారైనా మాంసాహార వారసులే అని మానవీయ శాస్త్రాలు నొక్కి చెబుతున్నాయి.

ఒక జంతువుని తినడం నిషేధించడం తెగ లక్షణం. అలాగే ఆర్యులు గోవుని తెగగుర్తుగా, దైవంగా పవిత్రంగా దాన్ని భావించడంతో ఎవరు తప్పు పట్టారు. చార్వాకులు, బౌద్ధులు, ఆహారం కోసం తినడాన్ని వ్యతిరేకించలేదు. యజ్ఞాల పేరుతో శ్రాద్ధాల పేరుతో అన్నం పరబ్రహ్మ స్వరూపమని భావించే హిందూ జాతే ఆహారాన్ని నిప్పుల పాలు, నేలపాలు చేయడాన్ని తిరస్కరించారు. వీరికంటే భిన్నంగా పూర్తిగా హింసని నిరసించినవారు జైనులు. అహింసావాదులని ఎఱ్ఱన అరణ్యపర్వంలో నిరసించడాన్ని కింది పద్యంలో గమనించవచ్చు.

సలిలములుర్వి యాకసము సర్వము జందుమయంబుగావునం
గలుగు నవశయకమున్ సకల కర్మములందును హింస హింసకుం
దొలగిన దేహయాత్ర దుర్ఘటమూనటులుండు నింతయుం
దలపరు హింససేయమని తారు తలంతురు గొందఱిమ్మహిన్ (మహాభారతం అరణ్యపర శేషం 5-58)

బాగా తినీ తినీ, అవి అంతరించే క్రమంలో తమ తెగ గుర్తుగా ప్రకటించుకున్న జంతుమాంసాన్ని ఆదిమ తెగలు తినరు కాని వేరేవాళ్ళు తింటే వారికి అభ్యంతరం లేదు. పైగా ప్రత్యేక సందర్భంలో తమ టోటమ్‌ని 'బలిచ్చి' తిని, తమకి శక్తులు వచ్చినట్లుగా భావించేవారు. "బీఫ్"ని ఇప్పుడు బాగా తింటున్న వారిలో హిందు వర్గ, కుల పద్ధతిలో అణచివేతకు, అడుక్కి తొక్కబడ్డవారు. ఆ వివక్షకు

బయటకి పోయిన 90% ఉన్న మతం మారిన దళితులు బహుజనులు. మీకు మేం బీఫ్ తినడంలో అభ్యంతరం ఉండదు. ఆ పేరుతో మేం ఏకం కావడం బీఫ్ మహాశక్తితో రాజ్యాధికారంవైపు, మీపీఠాల పునాదులు కదిలిస్తామని భయంతో దాడులు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఇవన్నీ చాలక వ్యవసాయ దశలోని సింధు ప్రజలు, మాతృదేవతలకు తాంత్రికతని ఆపాదించి భూసురులని, అగ్రవర్ణం వారని పిలుచుకున్న బ్రాహ్మణులు, శక్తి ఆరాధన లేదా తాంత్రిక ఆరాధనని కుల్లూకభట్టు వంటి పండితుల అభిప్రాయంలో తాంత్రికత వేదంతో సమానమని, వేదం నిత్యం దొరికే భార్య అయితే తాంత్రికత అరుదుగా దొరికే దేవత వంటిదని గౌరవించారు. తాంత్రిక సంప్రదాయంలో పంచమకారులు అయిన మాంసం, మద్యం, మత్స్యం, ముద్ర, మైథునం అనేవి తప్పని సరిగా అనుభవించాలని, అలా అనుభవించకపోతే బ్రాహ్మ జ్ఞానం గల బ్రాహ్మణుడే కాదని వారి నిశ్చితాభిప్రాయం. (వేమన్న వేదం పుట. 32)

బ్రాహ్మణులలో ఇప్పటికి ఉత్తర భారతదేశంలో బెంగాల్, ఒరిస్సా మొదలైన చోట్ల మద్యం, మాంసం, చేపలు తింటున్నారు. మేం మాంసాహారం తినం అని మూర్తిభవించిన అహింసామూర్తులుగా చెప్పుకునే చాలామంది రహస్యంగా మద్యమాంసాలని తిని తాగే సవర్ణులు దేశంలో కోకొల్లలు. ఇది ఎలా ఉందంటే "దీపం మలిపితే దినుసులన్నీ ఒకటే అన్న చందంగా ఉంది. చివరికి కళ్యాణి బిర్యానిని కూడా వదలకుండా తింటున్నారు. కాబట్టి సామాన్య దళితులు, బహుజన, ముస్లింలకు ఈ గొడ్డుమాసం లేదా పెద్దకూర అందుబాటులో లేకుండా పోయింది.

అన్ని వేదాల్లో ఉన్న యష అని రొమ్ము విరుచుకొని ఘనంగా తొడలు చొరచుకునే జాతికి, గర్వపడే జాతికి గోమాంసం తినడం వేదాల్లో ఉన్నదన్న నిజాన్ని ఎందుకు కళ్ళుమూసుకొని పాలుతాగే పిల్లుల్లాగా ఒప్పుకోరు. దీనికి ఆయా, జాతులకి తగిన హోదాని గుర్తింపుని ఇచ్చినట్లుగానే ఆహారం విషయంలో కూడా తగిన ఆహారం పెట్టమని ఆంధ్రమహాభాగవతంలో పోతన చెప్పిన విషయం గుర్తించాలి.

"బహురసాన్నంబు పెట్టుడు బ్రాహ్మణులకు / నచలులై పూజలొనరింపు దచలమునకు
నధమ చండాల శునక సంహతికి దగిన / భక్షములనిండు కసవులు పశువుల కిండు"

(ఆంధ్రా మహాభాగవతం, దశమ స్కంధం, పూర్వభాగం, పద్యం-883 పుట సంఖ్య 201)

దీన్ని బట్టి గోమాంసం తినడం అనేది ఇక్కడ ఆత్మగౌరవంగా దళిత బహుజనులు బీఫ్ ఫెస్టివల్ రూపంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ దళిత బహుజన విద్యార్థులు వ్యక్తీకరించారు. దీనిపైన జరిగిన దాడికి మూలాలు ఇప్పటివికావు అది నన్నయ కాలం నుండి లేదా అంతకు ముందునుండే సవర్ణులు చేస్తున్నవిగా గమనించాలి.

---

ఆధార గ్రంథాలు :-

1. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం, నన్నయ అది పర్వం (సం.ప) జి.వి. సుబ్రహ్మణ్యం 2003, తిరుపతి
2. కవిత్రయ విరచిత శ్రీ మదాంధ్ర మహాభారతం, ఎర్రన అరణ్య పర్వశేషం, (సం.ప) జి.వి. సుబ్రహ్మణ్యం, 2003, తిరుపతి
3. భవభూతి ఉత్తరరామ చరితము, వాఖ్యాత నేలటూరు రామదాసయ్య, 1997, హైదరాబాద్
4. జనకథ, రాంభట్ల కృష్ణమూర్తి, 1997, హైదరాబాద్
5. డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు సం.పు. 4, (ప్ర.సం) పేర్వారం జగన్నాథం, 1994, హైదరాబాద్